సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 25 । మే । 2024



కౌంటింగ్ ఏజెంట్లే కీలకం

పోలింగ్ ఒక ఎత్తయితే, చివరిదైన కౌంటింగ్ మరో ఎత్తు. కౌంటింగ్ సమయంలో అభ్యర్థి తరఫున ప్రతినిధిగా వ్యవహరించే కౌంటింగ్ ఏజెంట్ పాత్ర చాలా కీలకం. -8లో



నాడు-నేడు పనులు వేగవంతం

లక్కిరెడ్డిపల్లి మండలంలో నాడు-నేడు పనులు వేగవంతం చేసి వెంటనే పూర్తిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.320	రూ.440
రెండోరకం	రూ.230	రూ.310

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 597 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	405	485
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 299.560 కిలోలు

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

సంబేపల్లి: సంబేపల్లె మండల పరిధిలోని పొట్టిరెడ్డిగారిపల్లిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి శుక్రవారం పరిశీలించారు.అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. జూన్ నెల నుంచి సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. నీటి నిలువ ఉన్న వాటిలో అబేట్ వేయాలన్నారు. గ్రామాల్లో జ్వరాలు వస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారులు వై ప్రసాద్ యాదవ్,స ఎస్ జయరామయ్య, వైద్య సిబ్బంది బి రవిశంకర్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి రాము

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ సంస్థలో కీలక స్థానంలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు కష్టపడి కాకుండా ఇష్టపడి విధులు నిర్వహించాలని అన్నమయ్య జిల్లా ప్రజా రవాణాధికారి రాము పిలుపునిచ్చారు. శుక్రవారం కడపలోని ఆర్‌ఎం కార్యాలయ సమావేశ మందిరంలో అత్యల్ప ఇంధన పొదుపు, ప్రమాద రహిత డ్రైవింగ్‌పై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విధుల ద్వారా సంస్థ పురోభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అధిక కేఎంపీఎల్ సాధించవచ్చని, ప్రయాణీకుల అభిమానాన్ని సంపాదించవచ్చని తెలిపారు. అనంతరం ఇన్‌స్ట్రక్టర్ హనీఫ్ పంచసూత్రాలను డ్రైవర్లకు వివరించి వాటి వల్ల ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు డిపో మేనేజర్ ప్రవీణ్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీరింగ్ అధికారులు, బద్వేలు, మైదు కూరు, మదనపల్లె ఎస్‌డీఐలు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలకు చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు కృషి చేయాలి

కడప అర్బన్(వైఎస్సార్ జిల్లా) : జిల్లాలో అంధత్వ నివారణకు ప్రతి ఒక్క వైద్యుడు కృషి చేయాలని నేషనల్ పోగ్రాం కంట్రోల్ బ్లైండ్‌నెస్ (ఎన్‌పీసీబీ) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ నాయక్ తెలియజేశారు. శుక్రవారం కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆప్తాలమిక్ ఓపీ విభాగంలో పరికరాలను పరిశీలించారు. వైద్య విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం జిల్లా అంధత్వ నివారణ సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జిల్లాలో అంధత్వ నివారణ కోసం చేపడుతున్న, చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో కడప రిమ్స్ ఆప్తాలమిక్ హెచ్‌ఓడీ డాక్టర్ కిరణ్మయి, జిల్లా అంధత్వ నివారణ సొసైటీ అధికారి డాక్టర్ సునీత, డాక్టర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై చెన్నకేశవుడు



గజ వాహనంపై ఊరేగుతున్న ఉత్సవ మూర్తులు


రాజుపాళెం: వైఎస్సార్ జిల్లా రాజుపాళెం మండలంలోని వెల్లాలలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గజ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ముందుగా ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ బుక్కసముద్రం జగదీశ్వర రెడ్డి, ఈటె నరసయ్య, సింగిల్ విండో చైర్మన్ బాలనాగిరెడ్డి, భక్తులు స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్‌లు పట్టాభి సీతారామిరెడ్డి, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్

- స్కూళ్ల పునః ప్రారంభానికి ముందే జిల్లాకు చేరిక
- 8 నుంచి పదో తరగతి వరకు నేరుగా మండల స్టాక్ పాయింట్లకు
- ఒకటి నుంచి ఏడు వరకు జిల్లా స్టాక్ పాయింట్‌కు
- నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో రాక



తంబళ్లపల్లె ఎమ్మార్సీకి వచ్చిన టెక్స్ట్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు



మదనపల్లె సిటీ: గత తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉండేది. పాఠ్యపుస్తకాల కోసం విద్యార్థులు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. విద్యా సంవత్సరం ముగిసే దశలోనూ పూర్తి స్థాయిలో అందేవి కావంటే క్షేత్రస్థాయిలో సమస్య తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ తరుణంలో 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. నాడు-నేడుతో మౌలిక వసతులు.. విద్యాకానుక పేరుతో విద్యార్థులకు తొమ్మిది రకాల వస్తువులు.. జగనన్న గోరుముద్ద...తదితర పథకాలతో ప్రభుత్వ పాఠశాలల వైపు ఎక్కువ మంది మొగ్గు చూపేలా చర్యలు చేపట్టారు. తాజాగా పాఠశాలల పునః ప్రారంభం నాటికే పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలను అందించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రమాణాల పెంపే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో స్కూళ్ల పునః ప్రారంభం నాటికే పాఠ్యపుస్తకాలను పూర్తిస్థాయిలో అందించేలా కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పుస్తకాలు జిల్లాలో మొదటి విడతలో రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు, నందలూరు, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండ్యం, రాయచోటి, సంబేపల్లి, టి.సుండుపల్లి, వీరబల్లి మండలాలకు 1 నుంచి 7 తరగతుల పాఠ్యపుస్తకాలు 1,29,852 పంపారు. మరో నాలుగైదు రోజుల్లో మరో 15 మండలాలకు పాఠ్యపుస్తకాలు మండల స్టాక్ పాయింట్లకు పంపనున్నారు. ఒకటి నుంచి పదోతరగతి వరకు ప్రతి పాఠ్య పుస్తకం కవర్‌పేజీలో మార్పులు చేసి, విద్యార్థులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు. పాఠ్యపుస్తకంలో క్యూఆర్ కోడ్‌ను కూడా ముద్రించారు. దీని ద్వారా పాఠ్యాంశానికి సంబంధించిన అదనపు సమాచారాన్ని పొందవచ్చు.

దశల వారీగా అన్ని తరగతులకు సెమిస్టర్ విధానం

పుస్తకాల బరువుతో విద్యార్థుల వెన్నుముకపై భారం పడకుండా ఉండేందుకు సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో 1-9 తరగతి వరకు సెమిస్టర్ విధానం అమలు చేయగా, ఈ ఏడాది పదో తరగతికి కూడా అమలు చేశారు. గణితం, సైన్స్ సబ్జెక్టులను రెండు సెమిస్టర్లుగా విడదీశారు. సిలబస్ మొత్తాన్ని జూన్ నుంచి అక్టోబర్ వరకు సెమిస్టర్-1, నవంబర్ నుంచి మార్చి వరకు సెమిస్టర్-2 విభజించారు. దశలవారీగా అన్ని తరగతులకు సెమిస్టర్ విధానం అమలు చేశారు. 1-10 తరగతులకు పాఠ్యపుస్తకాలల్లో బైలింగ్వల్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఒక పేజీలో ఇంగ్లీషు, ఒక పేజీలో తెలుగు పాఠ్యాంశాన్ని ముద్రించి ఇవ్వడం వల్ల విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుని చదువుకునే వీలుంటుంది. 1-10 తరగతుల విద్యార్థులకు పాఠ్యపుస్తకాల సంబంధించి 111 టైటిల్స్ సరఫరా చేస్తున్నారు.

రెండు విధాలుగా పుస్తకాల సరఫరా

గత విద్యా సంవత్సరం వరకు పాఠ్యపుస్తకాలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 15 మండలాలకు తిరుపతి పుస్తక గోదాం నుంచి సరఫరా చేశారు. మరో 15 మండలాలకుల కడప పుస్తక గోదాం నుంచి సరఫరా చేశారు. అయితే ఈసారి కడప పుస్తక గోదాం నుంచి జిల్లా వ్యాప్తంగా సరఫరా చేస్తున్నారు. అయితే ఈసారి పాఠ్యపుస్తకాలు రెండు విధాలుగా సరఫరా చేస్తున్నారు. 1-7 తరగతులకు నేరుగా పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్‌లు పుస్తక గోదాం నుంచి మండల స్టాక్‌పాయింట్‌లకు సరఫరా చేస్తున్నారు. 8-10 తరగతులకు ప్రభుత్వం అనుమతి పొందిన ప్రిటింగ్ ప్రెస్‌ల



నుంచి నేరుగా మండల స్టాక్ పాయింట్‌లకు పంపిస్తున్నారు. ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా మండల స్టాక్‌పాయింట్‌లకు సరఫరా ప్రారంభమైంది.

పాఠశాలలు తెరిచిన రోజే పుస్తకాలు అందజేత



పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులందరికి పుస్తకాలచ్చేలా చర్యలు చేపట్టాం. వచ్చే నెల 10 నాటికి మండల స్టాక్ పాయింట్‌ల నుంచి పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు చేరుస్తాం. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు పాఠ్యపుస్తకాలతో పాటు వర్క్‌బుక్‌లు, ఆరు నుంచి పదో తరగతి వరకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు అందజేయనున్నాం.

–శివప్రకాష్‌రెడ్డి,
డీఈఓ, అన్నమయ్య జిల్లా

ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- డీఆర్‌ఓ సత్యనారాయణరావు



పరీక్షల నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ సత్యనారాయణ

రాయచోటి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ నియామకానికి ఈ నెల 25న నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ప్రిలిమనరీ పరీక్షకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డీఆర్‌ఓ సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో పరీక్ష ఏర్పాట్లుపై వివిధ శాఖల అధికారులతో డీఆర్‌ఓ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాల ద్వారా 1011 మంది అభ్యర్థులకు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ చెప్పారు. పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తారని చెప్పారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి సకాలంలో పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో ఆన్‌లైన్ పరీక్ష రాసేలా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రతి కాలేజీకి రెవెన్యూ తరఫున ఒక్కో లైజన్ అధికారిని ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్‌ఓ చెప్పారు. సమావేశంలో కలెక్టరేట్ ఏఓ గోవిందుసింగ్, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలు:
- ఆదిత్యా ఇంజినీరింగ్ కళాశాల, మదనపల్లె
- మదనపల్లి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, మదనపల్లె
- విశ్వం ఇంజినీరింగ్ కళాశాల, కురబలకోట,
- భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, రామాపురం మండలం

సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

రాయచోటి: జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం మొదటి సంవత్సరం, మధ్యాహ్నం రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో మొదటి సంవత్సరానికి 2446 మందికి 2317 మంది హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 478 మందికి 449 మంది హాజరయ్యారు. మొదటిరోజున తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం పరీక్షలు జరిగాయి. జిల్లా ఇంటర్మీడియట్‌శాఖ అధికారి ఆర్ కృష్ణయ్య పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంబంధించిన హాల్ టికెట్లను ఆయన పరిశీలించారు.

పది పరీక్షలకు 1203 మంది గైర్హాజరు

పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జిల్లాలోని 23 కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. 1720 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా కేవలం 517 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. 1203 మంది హాజరు కాలేదు. పరీక్షలను జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి, స్క్వాడ్ సిబ్బంది పర్యవేక్షించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు డీఈఓ తెలిపారు.



రాయచోటిలోని బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న ఆర్ కృష్ణయ్య

వర్షాధారం..నాణ్యతే ప్రామాణికం

- నాణ్యమైన విత్తనాలతోనే దిగుబడి పెంపు
- అత్యుత్తమ విత్తనాలను అందించాలని అన్నదాతల డిమాండ్



సాక్షి రాయచోటి/పీలేరు రూరల్ : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అందించే సబ్సిడీ వేరుశనగ కాయలు నాణ్యమైనవి అందిస్తేనే దిగుబడి పెరిగే అవకాశం ఉంది. అలా కాకుండా సబ్సిడీ..లొట్టలతోపాటు నాసిరకం అందిస్తే పంట దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే ఏడాదిలో వర్షాధారం కింద సాగు చేసే అన్నదాతలకు ప్రతి ఏడాది వ్యవసాయశాఖ ఖరీఫ్‌లో సబ్సిడీపై విత్తనాలను అందించడం ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. అయితే ముందస్తుగా కొనుగోలు చేసి నాణ్యత కలిగిన కాయలను ఎంపిక చేసి రైతులకు అందించేవారు. ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన ఎక్కడికక్కడే రైతులు, గోడౌన్ల వద్ద కొనుగోలు చేసి అందించే వేరుశనగ కాయలలో నాణ్యత ఉండదని రైతులు పెదవి విరుస్తున్నారు. అన్నమయ్య జిల్లాకు సబ్సిడీ వేరుశనగ కాయలు 55,383 క్వింటాళ్లు మంజూరయ్యాయి. జిల్లాలోని నియోజకవర్గాలతో పాటు మండలాల వారీగా పంపిణీకి వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడమే ఆలస్యం, వెంటనే పంపిణీకి చర్యలు చేపట్టనున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఆర్బీకేల ద్వారా అవసరమైన రైతులు రిజిస్టర్ చేసుకోవాలని పిలుపునిచ్చిన తరుణంలో పెద్ద ఎత్తున రైతులు నమోదు చేసుకుంటున్నారు.

- జిల్లాలో రైతులకు అందించే సబ్సిడీ వేరుశనగ కాయల విషయంలో నాణ్యతకు పెద్దపీట వేయాలని రైతులు కోరుతున్నారు. ఎందుకంటే ముందుగా విత్తన మొలకశాతంతోపాటు విత్తన పరిపుష్టి శాతాన్ని పూర్తి స్థాయిలో పరిశీలించి అందించాలని ఏపీ సీడ్స్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులను రైతులు కోరుతున్నారు. ఏడాదికి ఒకసారి వర్షాభావం కింద సాగు చేసే పంట కావడంతో ఏదైనా తేడా వస్తే నష్టపోవాల్సి వస్తుందని తెలియజేస్తున్నారు.

నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదు: జేడీ

రైతులకు సంబంధించి అందించే సబ్సిడీ వేరుశనగ విత్తనాల విషయంలో ఖచ్చితంగా నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ తెలియజేశారు. 74 శాతం అవుటన్ ఉంటేనే పాయింట్ల నుంచి విత్తనాలను తెస్తున్నామని తెలియజేశారు. ఏపీ సీడ్స్ ద్వారా జిల్లాలో ఆరు చోట్ల ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని, అక్కడ తయారైన విత్తనాలను నాణ్యత, అవుటన్ పరిశీలించిన తర్వాతనే రైతులకు సరఫరా చేస్తున్నామన్నారు. నాణ్యత విషయంలో కఠినంగా ఉన్నామని, అలాంటి లాట్లతో బస్తాలు వచ్చినా వెంటనే వెనక్కి పంపుతాము తప్ప తీసుకోమన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) కూడా 10 మంది రైతులతో ఒక క్వాలిటీ టీం ఏర్పాటు చేశామని...దీంతో తేడా రాదన్నారు. ఒకవేళ ఏదైనా నాణ్యత విషయంలో తేడా వస్తే ఆర్బీకే అసిస్టెంట్, ఏఓ, ఏడీఏలపై చర్యలు తప్పవని ఆయన సాక్షికి తెలియజేశారు.

పీలేరు ఎమ్మెల్యేను కలిసిన రైతులు

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఏపీ సీడ్స్ ద్వారా అందిస్తున్న విత్తనాల విషయంలో నాణ్యత అనుమానాలు రావడంతో పలువురు రైతులు శుక్రవారం పీలేరులో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఏపీ విత్తన అభివృద్ధి సంస్థ మేనేజర్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఈ ప్రాంతంలో పండిన విత్తనాలు కొనుగోలు చేసి అవే తిరిగి రైతులకు పంపిణీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. వేరే ప్రాంతాల్లో అధిక దిగుబడులు వచ్చిన విత్తనకాయలు కొనుగోలు చేసి, అలాంటివి ఇవ్వాలని, దీంతో మంచి దిగుబడి వచ్చి రైతులు ఆర్థికాభివృద్ధి చెందుతారని అధికారులకు వివరించారు.

కట్టుదిట్టమైన భద్రత నడుమ కౌంటింగ్

జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని కట్టుదిట్టమైన భద్రత నడుమ సజావుగా, పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం అభిషిక్త్ కిషోర్ తెలిపారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో-2024 సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎంసీసీ అమలు, 144 సెక్షన్ పాటింపుపై రాజంపేట పార్లమెంట్ అభ్యర్థులు, ప్రతినిధులతో జిల్లా ఎస్పీ బి కృష్ణారావుతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రంలో అభ్యర్థులు, ఏజెంట్లు పాటించాల్సిన విధానాలపై ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన రాజకీయ పార్టీ అభ్యర్థులు, ప్రతినిధులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో చివరిఘట్టమైన ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని జూన్ 4వ తేదీన మూడెంచెల భద్రత నడుమ నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో నిఘా కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాజంపేట పార్లమెంట్‌కు జిల్లా వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు పుంగనూరుతో కలిపి మొత్తం 79.12శాతం పోలింగ్ నమోదైందన్నారు. రాయచోటి సాయి ఇంజనీరింగ్ కలాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లతోపాటు పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లతో నిక్షిప్తమైన ఈవీఎంలను సురక్షితంగా భద్రపరిచినట్లు చెప్పారు. ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్ సెగ్మెంట్‌కు విడివిడిగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో 14 చొప్పున ఈవీఎం కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకు ప్రత్యేకంగా ఒక కౌంటింగ్ కేంద్రంలో 20 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కౌంటింగ్ కేంద్రంలో ప్రతి టేబుల్‌కు ఒక ఏజెంట్ వంతున నియమించుకోవచ్చన్నారు. కౌంటింగ్‌కు మూడు రోజుల ముందే ఏజెంట్ల వివరాలు ఇవ్వాలన్నారు. ఏజెంట్లు అందరూ ఓట్ల లెక్కింపు రోజున ఉదయం 7 గంటలకు కౌంటింగ్ కేంద్రంలో ఉండాలన్నారు. వారికి కేటాయించిన నియోజకవర్గం కౌంటింగ్ కేంద్రంలో సంబంధిత టేబుల్ వద్ద ఏజెంట్లు కూర్చోవాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజున ఉదయం 6 గంటలకు అభ్యర్థులు, అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూములు ఓపెన్ చేస్తారన్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ 8.30 గంటలకు ఈవీఎం కౌంటింగ్ మొదలు పెడతారని చెప్పారు. పార్లమెంట్ పరిధిలోకి వచ్చే పుంగనూరు నియోజకవర్గానికి సంబంధించి చిత్తూరు జిల్లాలో లెక్కింపు చేసి వివరాలను ఇక్కడికి పంపుతారన్నారు. కౌంటింగ్ కేంద్రం ఉన్న ప్రాంతాన్ని నో డ్రోన్ ఫ్లైజోన్‌గా ప్రకటించినట్లు తెలిపారు. భద్రతా చర్యల్లో భాగంగా జూన్ 1నుంచి 6వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గెలుపు ఓటములను సమభావంతో తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎవరు కూడా క్షణికావేశాలకు లోనుకారాదని సూచించారు. విజయ యాత్రలు, బాణాసంచా కాల్చడం నిషేధం అన్నారు. అందరూ సహకరించి ఓట్లు లెక్కింపు ప్రక్రియలు విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద మూడు అంచల విధానంలో భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు జిల్లాలో మోడల్ కోడ్ అమలులో ఉంటుందని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఎవరైనా గొడవలు, అల్లర్లు సృష్టించాలని చూస్తే ఎవరినైనా ఉపేక్షించమని, పరిధి దాటిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. వీలైతే అరెస్టు కూడా చేస్తామన్నారు. జూన్ 19వ తేదీ వరకు జిల్లాలో బీఎస్ఎఫ్ ఫోర్సు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తంబళ్లపల్లె : మినీ టెంపో, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.., గుండ్లపల్లె పంచాయితీ పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన చలపతి(45), మలిగివారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి(60) ద్విచక్ర వాహనంలో సొంత పనుల కోసం తంబళ్లపల్లెకు బయలుదేరారు. చెన్నప్పగారిపల్లె మలుపులో ఎదురుగా వచ్చిన మినీ టెంపో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యంకోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళకు..


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉమాదేవి

మదనపల్లె : ట్రాక్టర్ ఢీకొని మహిళ గాయపడిన సంఘటన చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో జరిగింది. ఈడిగపల్లె పంచాయతీ చిలకవారిపల్లెకు చెందిన కేశవ భార్య జి.ఉమాదేవి(30) తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంలో టమాటా కోసేందుకు వెళ్తున్నారు. మార్గ మధ్యంలో వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ఉమాదేవి తీవ్రంగా గాయపడగా, గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదంలో చిన్నారికి..

– అంగన్‌వాడీ సిబ్బందిపై ఫిర్యాదు


చిన్నారి స్పందనతో తల్లి బాగ్యలక్ష్మి

కలకడ : అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యంతో చిన్నారికి గాయాలైనట్లు బాదితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన శుక్రవారం మండలం యర్రయ్యగారిపల్లెలో జరిగింది. బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారి పల్లె ఎస్టీ కాలనీకి చెందిన కె.రాజశేఖర్ భార్య భాగ్యలక్ష్మి తన కుమార్తె స్పందన (3)ను శుక్రవారం ఉదయం స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి పంపింది. తిరిగి 12గంటల సమయంలో చిన్నారిని రోడ్డు వద్దనే వదిలివేయడంతో దాటుతున్న సమయంలో ద్విచక్ర వాహనం చిన్నారి స్పందనను ఢీకొంది. అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యంతోనే తన కుమార్తె గాయాలపాలయ్యారని, వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాదితులు తెలిపారు.

కౌంటింగ్ ఏజెంట్లే కీలకం

- జూన్ 4న రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు





రాయచోటి: సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఈ కళాశాలలో రాజంపేట పార్లమెంట్‌తో పాటు జిల్లాలోని రాయచోటి, రాజంపేట, కోడూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. పోలింగ్ ఒక ఎత్తయితే, ఎన్నికల ప్రక్రియలో చివరిదైన కౌంటింగ్ మరో ఎత్తు. కౌంటింగ్ సమయంలో అభ్యర్థి తరపున ప్రతినిధిగా వ్యవహరించే కౌంటింగ్ ఏజెంట్ పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. కౌంటింగ్‌కు మూడు రోజుల ముందు సాయంత్రం 5 గంటల్లోపు కౌంటింగ్ ఏజెంట్ల నియామకానికి సంబంధించిన ఫారం–18 సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ఎన్నికల రూల్స్–1961 ప్రకారం అభ్యర్థి లేదా ఎన్నికల ఏజెంట్ ఆమోదంతో కౌంటింగ్ ఏజెంట్లను నియమిస్తారు. ఫారం –18 భర్తీ చేసి ఫొటో జతపరిచి ఒక కాపీ అభ్యర్థి లేదా తన ఎన్నికల ఏజెంటు ద్వారా, మరో కాపీ కౌంటింగ్ ఏజెంట్ ద్వారా ఆర్వోకు సమర్పించాల్సి ఉంటుంది. ఆర్వోలు కౌంటింగ్ ఏజెంట్లకు ఐడీ కార్డులు తయారు చేసి పంపుతారు. కౌంటింగ్‌కు గంట ముందు అపాయింట్మెంట్ లెటర్, ఐడీ కార్డు ఆర్వోలకు సమర్పించాల్సి ఉంటుంది. ఫారం–19 ద్వారా కౌంటింగ్ ఏజెంట్ అపాయింట్మెంట్‌ను రద్దు చేసే అధికారం అభ్యర్థి లేదా ఎలెక్షన్ ఏజెంట్‌కు ఉంటుంది. కొత్త కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల సంఘం అనుమతి పొందిన వ్యక్తులు, పరిశీలకులు, ఎన్నికల విధులతో సంబంధం కలిగిన ఉద్యోగులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు కౌంటింగ్ హాలులోకి ప్రవేశించేందుకు అనుమతిస్తారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లను ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయిస్తారు. అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో కౌంటింగ్ జరుగుతుంది. ఏఆర్‌ఓకు కూడా కౌంటింగ్ నిర్వహించే అధికారం ఉంటుంది. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఐ ప్యాడ్లు, ల్యాప్‌టాప్‌లు తీసుకు వెళ్లరాదు. పెన్ను, పేపరు, 17–సి డూప్లికేట్ కాపీ (అకౌంట్ ఆఫ్ ఓట్స్) తీసుకెళ్లవచ్చు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీలు, ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు ఉన్న పార్టీలు, రిజిస్టర్ అయి గుర్తింపు పొందని పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లకు కౌంటింగ్ టేబుల్స్ వద్ద ప్రాధాన్యతా క్రమాన్ని అనుసరించి సీటింగ్ అరేంజ్‌మెంట్స్ ఉంటాయి. పొగతాడం నిషేధం. కౌంటింగ్ జరుగుతున్న సమయంలో కౌంటింగ్ హాలు నుంచి ఏజెంట్లు బయటికి వెళ్లేందుకు అనుమతి ఉండదు. ఫలితాలు వెలువడిన తర్వాత వెళ్లవచ్చు.

ఏజెంట్లకు అవగాహన అవసరం

ఈవీఎంలు, వీవీ ప్యాట్లతో నిర్వహించిన ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనల పట్ల కౌంటింగ్ ఏజెంట్లు అవగాహన కలిగి ఉండాలి. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, పనిచేసే విధానంపై అవగాహన తప్పనిసరి. ఈవీఎంలు, వీవీ ప్యాట్లలో నిక్షిప్తమై ఉన్న ఓట్లను లెక్కించే ప్రక్రియ గురించి తెలుసుకోవాలి. పోస్టల్ బ్యాలెట్లు, ఎలక్ట్రానికలీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీ పీబీఎస్) లెక్కింపు గురించి తెలిసి ఉండాలి.

మార్గదర్శకాలు ఇవీ..

వాస్తవంగా కౌంటింగ్ ఏజెంట్లకు ఫలానా అర్హతలు ఉండాలని చట్టం ఎక్కడా పేర్కొనలేదు. అభ్యర్థులు 18 సంవత్సరాలు నిండిన వారిని ఏజెంట్లుగా నియమించుకుంటే వారు కౌంటింగ్ సక్రమంగా వీక్షించేందుకు వీలుంటుంది. సాయుధ రక్షణ కలిగిన వ్యక్తులను కౌంటింగ్ హాలులోకి అనుమతించరాదని ఈసీఐ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్, జెడ్పీ చైర్మన్లు, పబ్లిక్ రంగ సంస్థలు, కార్పొరేషన్ల చైర్మన్లు కూడా ఏజెంట్లుగా కూర్చొనేందుకు అనర్హులు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం పొందే వారు, ప్రభుత్వ–ఎయిడెడ్ సంస్థల్లో పనిచేసే పార్ట్‌టైమ్ ఉద్యోగులు, పారా మెడికల్ స్టాఫ్, ఎఫ్‌పీ షాపు డీలర్లు, అంగన్వాడీ ఉద్యోగులు, పోలింగ్ ఏజెంట్లుగా ఉండరాదు. ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఏజెంట్లుగా వ్యవహరిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం–1951 సెక్షన్ 134(ఏ) ప్రకారం శిక్షార్హులవుతారు. వీరికి మూడు నెలల జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ కలిపి విధించే అవకాశం ఉంది. సర్పంచ్‌లు, పంచాయతీ వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కౌంటింగ్ ఏజెంట్లుగా కూర్చొనేందుకు ఎలాంటి అభ్యంతరం ఉండదు. భారత పౌరసత్వం కలిగిన ఎన్‌ఆర్‌ఐలు కూడా కూర్చొవచ్చు. ప్రభుత్వ గన్‌మెన్ సౌకర్యం ఉన్న వారు ఎన్నికల ఏజెంట్‌గా, కౌంటింగ్ ఏజెంట్‌గా ఉండరాదు. అలాంటి వ్యక్తి సెక్యూరిటీతోగానీ, సెక్యూరిటీ లేకుండాగానీ కౌంటింగ్ హాలులోకి ప్రవేశించరాదు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి తనకున్న సాయుధ రక్షణను స్వచ్ఛందంగా వదులుకుంటే కౌంటింగ్ హాలులో కూర్చొనేందుకు అనుమతిస్తారు. ఒక కౌంటింగ్ హాలులో 14 టేబుళ్లు, ఒక ఆర్వో టేబుల్ కలిపి మొత్తం 15 టేబుళ్లు ఉంటాయి. ఆ మేరకు అభ్యర్థులు తమ ఏజెంట్లను నియమించుకోవచ్చు. పోస్టల్ బ్యాలెట్లు, ఈటీపీబీఎస్ లెక్కింపునకు అదనపు టేబుల్ అవసరమని భావిస్తే అందుకోసం వేరే కౌంటింగ్ హాలులో అదనపు టేబుల్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అప్పుడు అభ్యర్థులు అక్కడ అదనంగా మరో కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చు.

నాడు–నేడు పనులు వేగవంతం

అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి


పనులు పూర్తి చేయాలని కోరుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మండలంలో నాడు–నేడు పనులు వేగవంతం చేసి వెంటనే పూర్తిచేయాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్‌కు చోటు ఇవ్వకుండా పకడ్బందీగా పరీక్ష నిర్వహించాలని సూపరిటెండెంట్, డీఈఓలకు సూచించారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు ప్రతి పాఠశాలకు అందేట్లు చూడాలని ఎంఈఓలకు సూచించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓలు చక్రే నాయక్, వెంకట సుబ్బయ్యలతో అయన మాట్లాడుతూ ఈ జూన్ 12వ తేదీలోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, మల్లికార్జున, సీఆర్‌పీలు మోహన్ రావు, శశికళ, చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

ఖజానా కుంభకోణం దర్యాప్తునకు బ్రేక్

డీఎస్పీకి బాధ్యతలు అప్పగించిన ఎస్పీ

బి.కొత్తకోట : ఏఐఎన్, పాన్, టీఏఎన్ కార్డులు దుర్వినియోగం చేసి కోట్లలో జరిగిన ట్యాక్స్ రీ ఫండ్ కుంభకోణం కేసు దర్యాప్తునకు బ్రేక్ పడింది. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, వాయల్పాడు సబ్ ట్రెజరీ కార్యాలయాల పరిధిలో సాగిన ఈ కుంభకోణం అప్పట్లో సంచలనం కలిగించింది. అనంతరం 2022 డిసెంబర్, 13న తిరుపతి ఆదాయ పన్ను శాఖ అధికారి రాజశేఖర్ మదనపల్లె రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడం, అదే రోజున సీఐ మురళీకృష్ణ కేసు నమోదు చేయడంతో దర్యాప్తు మొదలైంది. ఆ తర్వాత కేసు తీవ్రత, లోతైన దర్యాప్తు, ఆధారాల సేకరణ, విచారణ వ్యవహారాలు కుంభకోణంలో అనుమానాలు రేకెత్తించడంతో అప్పటి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మదనపల్లె డీఎస్పీని దర్యాప్తు అధికారిగా నియమించారు. సాధారణంగా ఉద్యోగులు చెల్లించిన వేతనాల పన్ను మొత్తం తిరిగి పొందేందుకు నిబంధనలు ఉంటాయి. ఆదాయ పన్నును తిరిగి ఇవ్వాలని దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు ఉద్యోగుల ఖాతాకు జమవుతుంది. అయితే కొందరు అధికారులు, ప్రైవేటు ఆడిటర్లు కుమ్మక్కై ఏఐఎన్, పాన్, టీఏఎన్ కార్డులతో చెల్లించిన పన్నులకు మించి భారీ మొత్తాలను రీఫండ్‌గా పొందారు. తంబళ్లపల్లె ఎస్‌టీఓ కార్యాలయంలో రీఫండ్ చెల్లించినట్టు గుర్తించగా, పీలేరు, మదనపల్లె, మరిన్ని ఎస్‌టీఓ కార్యాలయాల్లోనూ ఈ కుంభకోణం ఆనవాళ్లు గుర్తించి విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా గతేడాది ముగ్గురు అధికారులు, ఓ ఆడిటర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం రాజకీయ పర్యటనల్లో నెలకొన్న పరిస్థితులు, ఎన్నికలు, నేతల పర్యటనలతో ఈ కేసు దర్యాప్తు ఆగింది.

అందని ఎఫ్ఎస్ఎల్ నివేదిక

ఎన్నికల ఫలితాల తర్వాత కేసు విచారణ వేగవంతం కానుంది. పోలీసులు ఈ కేసులో కంప్యూటర్లు, సాంకేతిక పరికరాలు, సిమ్‌లను స్వాధీనం చేసుకుని విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. పరీక్షలకు సంబంధించి నివేదిక ఇంకా అందలేదని తెలిసింది. రీఫండ్ కోసం వినియోగించిన కంప్యూటర్లు కావడంతో అందులోనే పూర్తి స్థాయి ఆధారాలు ఉంటాయని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ నివేదిక కోసం ఎదురుచూస్తున్నారు.

కంప్యూటర్ సైన్స్‌కు ఎన్‌బీఏ అక్రిడేషన్


ఎన్‌బీఏ అక్రిడేషన్‌తో మిట్స్ ప్రొఫెసర్లు

కురబలకోట : అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీకి నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ శుక్రవారం తెలిపారు. మూడేళ్ల పాటు ఈ గుర్తింపు వర్తిస్తుందన్నారు. ఎన్‌బీఏ నిపుణుల కమిటీ ఇటీవల కళాశాలలో అకడమిక్ ప్రోగ్రామ్‌లపై అన్ని అంశాలను మూల్యాంకన ంతో పాటు మదింపు చేసి గుర్తింపు ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే సివిల్ ఇంజినీరింగ్, ఈఈఈ, ఈసీఈ, ఎంసీఏ, ఎంబీఏ ప్రోగ్రామ్స్‌కు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ గుర్తింపు లభించిందన్నారు. ఈ అక్రిడేషన్ వల్ల కళాశాల విద్యార్థులకు ప్రపంచ అగ్రశ్రేణి విశ్వ విద్యాలయాల్లో ఉన్నత విద్యకు, కార్పొరేట్ కంపెనీలలో ఉపాధి, ఉద్యోగాలు పొందడానికి దోహదపడుతుందన్నారు. వాషింగ్టన్ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా మూల్యాంకనం ఉంటుందన్నారు. ఈ గుర్తింపు రావడానికి కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులుకు కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఓడి శ్రీదేవి, పార్క్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి. ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో 1.70 లక్షల ఎకరాల్లో పంటల సాగు


అధికారులతో మాట్లాడుతున్న జేడీ చంద్రానాయక్

ములకలచెరువు : జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్లో 1.70 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయనున్నట్లు జేడీ చంద్ర నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మొలకలచెరువులోని వేరుశనగ విత్తన కాయల ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ములకలచెరువు, బి. కొత్తకోట, గుర్రంకొండ, కలకడ మండలాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి విత్తన కాయలను రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన విత్తనా కాయలు సరఫరా చేయకపోతే ప్రాసెసింగ్ యూనిట్ల లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. జిల్లా మొత్తానికి 55400 మెట్రిక్ టన్నులు వేరుశనగ విత్తనకాలు మంజూరైనట్లు చెప్పారు. అలాగే 40 వేల మెట్రిక్ టన్నులు ఎరువులు మంజూరు అయినట్లు తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. 29వ తేదీ నుంచి విత్తన కాయలు పంపిణీ చేస్తామన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఓ లీల కుమారి ఆయన వెంట ఉన్నారు.

మే 27 నుంచి పాలిసెట్ కౌన్సిలింగ్

రుసుం చెల్లింపునకు జూన్ 2వ తేదీ వరకు గడువు



హెల్ప్‌లైన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్

కడప ఎడ్యుకేషన్ : పాలిసెట్ పరీక్షలో అర్హత సాధించిన వారికి వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నెల 27వ తేదీ నుంచి వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. ప్రవేశాలు కోరుకునే విద్యార్థులు ముందుగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రాసెసింగ్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 చొప్పున ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు appoycet.nic.in వెబ్‌సైట్‌లో చెల్లించి రసీదు పొందాలి.

హెల్ప్‌లైన్ సెంటర్ వివరాలివీ....

విద్యార్థులు రుసుము చెల్లించిన తరువాత ధ్రువపత్రాల పరిశీలనకు తమ దగ్గరలోని హెల్ప్‌లైన్ సెంటర్‌కు ఈ నెల 27వ తేదీ నుంచి షెడ్యూల్ ప్రకారం నకలు పత్రాలతో రావాల్సి ఉంటుంది. కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, పొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్, రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లను హెల్ప్‌లైన్ సెంటర్లుగా ఏర్పాటు చేశారు. ఎస్టీ విద్యార్థులకు కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లోనూ, స్కౌట్, స్పోర్ట్స్, ఎన్‌సీసీ, పీహెచ్ మరియు క్యాప్ విద్యార్థులకు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోనూ కౌన్సెలింగ్ ఉంటుంది.

విద్యార్థులు తీసుకురావాల్సిన పత్రాలు

- కౌన్సిలింగ్ ఫీజు రసీదు
- ఏపీ పాలిసెట్ హాల్‌టికెట్
- పాలిసెట్ ర్యాంకు కార్డు
- 10వ తరగతి మార్కుల జాబితా (ఒరిజినల్ లేదా నెట్ కాపీ)
- 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు
- ఓసీ కేటగిరీ వారికి 2024–25 ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్
- ఇన్‌కం సర్టిఫికెట్(01.01.2021 నుంచి)
- కుల ధ్రువీకరణ పత్రం
- ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్(టీసీ)

ర్యాంకుల వారీగా కౌన్సిలింగ్ ఇలా...

తేదీ	ర్యాంకు నుంచి	ర్యాంకు వరకు
27.05.2024	1	12000
28.05.2024	12001	27000
29.05.2024	27,001	43000
30.05.2024	43001	59000
31.05.2024	59,001	75000
01.06.2024	75,001	92,000
02.06.2024	92,000	1,08,000
03.06.2024	1,08,001	చివరిర్యాంకు

విద్యార్థులు ఆప్షన్లు ఎంచుకోవచ్చు



ప్రాసెసింగ్ రుసుం చెల్లించిన తరువాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం తమ దగ్గరలోని హెల్ప్‌లైన్ సెంటర్‌కు ఈ నెల 27వ తేదీ నుంచి షెడ్యూల్ ప్రకారం హాజరుకావాలి. వెరిఫికేషన్ పూర్తయిన తరువాత మొబైల్ నెంబర్‌కు లాగిన్ ఐడీ వస్తుంది. రిజిస్టర్ మొబైల్ నెంబర్ వచ్చిన లాగిన్ ఐడిలో ఆప్షన్స్ పెట్టుకోవచ్చు. పూర్తి వివరాలకు htt pr://appoycet.nic.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలి. – సీహెచ్ జ్యోతి, ప్రిన్సిపల్, కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్

లారీ, బైక్ ఢీ – ఒకరి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పసుపులేటి సుబ్బనరసయ్య, గాయపడిన తోట వెంకటరమణ

పుల్లంపేట : మండలంలోని కడప–తిరుపతి జాతీయ రహదారి అప్పయ్యరాజుపేట పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే పెనగలూరు మండలం, కొండూరు గ్రామానికి చెందిన పసుపులేటి సుబ్బనరసయ్య, తోట వెంకటరమణ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో పసుపులేటి సుబ్బనరసయ్య మృతిచెందగా తోట వెంకటరమణ గాయపడ్డాడు. క్షతగాత్రుని హుటాహుటిన రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

అన్నపై తమ్ముడి దాడి

మదనపల్లె : అన్నపై తమ్ముడు దాడి చేసిన సంఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. స్థానిక బుగ్గకాలువకు చెందిన నారాయణస్వామి కుమారుడు ఎం.గంగాధర్(35) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఆటోను తనకు ఇచ్చేయాలని తమ్ముడు మురళి గొడవకు దిగి, కర్రతో అన్నపై దాడి చేశాడు. ఈ దాడిలో గంగాధర తలకు తీవ్రగాయం కాగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి


చిన్నారి మృత దేహాన్ని తీసుకెళ్తూ రోదిస్తున్న కుటుంబసభ్యులు

మదనపల్లె : ప్రమాదవశాత్తూ నీటి సంపులో పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని ఈశ్వరమ్మ కాలనీ రహమత్ నగర్‌కు చెందిన సాదిక్ బాషా, సనా దంపతుల రెండో సంతానం ఎస్.మన్నా ఫాతిమా(2). శుక్రవారం ఇంటి వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ అక్కడే ఉన్న నీటి సంపులో పడింది. కుటుంబసభ్యులు హుటాహుటిన బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో చిన్నారి కుటుంబ సభ్యులు విలపించడం ఆస్పత్రిలో పలువురినీ కలచివేసింది. చిన్నారి మృత దేహాన్ని తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లిపోగా, ఆస్పత్రి అవుట్ పోస్ట్ సిబ్బంది పోలీసులుక సమాచారం అందించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


మృతుడు రాగలకుమార్ (ఫైల్)

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రంగసముద్రం పంచాయతీ కుర్రావాండ్ల పల్లికి చెందిన రాగలకుమార్(37) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రవీంద్రబాబు కథనం మేరకు.. రాగలకుమార్ పలు చోట్ల అప్పులు చేస్తుండటంతో తండ్రి రామమూర్తి మందలించాడు. ఇది జీర్ణించుకోలేక జీవితంపై విరక్తి పెంచుకున్న రాగలకుమార్ శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో బి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి మహిళకు తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన వెంకటలక్ష్మి

మదనపల్లె : చెట్టుపై నుంచి పడి మహిళా కూలి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని అమ్మచెరువుమిట్టకు చెందిన పెద్ద రామాంజులు భార్య టి.వెంకటలక్ష్మమ్మ(34) కూలిపనుల్లో భాగంగా మామిడి కాయలు కోసేందుకు వలసపల్లెకు వెళ్లింది. చెట్టులో నుంచి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుమీద నుంచి జారి కిందపడి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సల కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

ఘనంగా వసంతోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌కు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి అలంకరించారు. గంగారాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను అశ్వ వాహనంపై ఊరేగించారు. గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు చేసి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం కొవ్వూరు రమేష్‌రెడ్డి, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వినియోగం జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, మురుకూటి సూర్య నారాయణ రెడ్డి, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.